మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల కేటీఆర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడుతున్న శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా.
– శేరిలింగంపల్లి, జూన్ 26

ప్రజలకు అసదుద్దీన్ వెంటనే క్షమాపణ చెప్పాలి

కాండూరి నరేంద్రాచార్య

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 26 : భారత పార్లమెంట్ నిండు సభలో పాలస్తీనాకు జై కొట్టిన అసదుద్దీన్ ఒవైసీ భారత జాతికి అవసరమా? అని, దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అసదుద్దీన్ ఓవైసీ భారతదేశ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య డిమాండ్ చేశాడు. భారత దేశ సార్వభౌమాధికారానికి నిలయమైన పార్లమెంట్ నిండు సభలో పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణ స్వీకార ఘట్టంలో జై పాలస్తీనా అంటూ జై కొట్టిన నీచ సంస్కృతి గల అసదుద్దీన్‌కు భారత పౌరునిగా జీవించే హక్కు లేదన్నారు. ఇలాంటి నాయకుడిని మన హైదరాబాద్ ప్రజలు ఎంపీగా ఎన్నుకోవడం సిగ్గుచేటన్నారు. తనను ఆదరించిన ప్రజలను, గౌరవించిన పార్లమెంట్‌ను, దేశ ప్రజలందరి మనోభావాలను దెబ్బతిసేలా మాట్లాడిన ఎంపీ అసదుద్దీన్ తక్షణమే దేశ ప్రజలందరికి క్షమాపణ చెప్పాలన్నారు.

స్టూడెంట్స్‌పై సస్పెన్షన్, ఫైన్‌లు రద్దు చేయాలి

హెచ్‌సీయూ గేట్ ముందు విద్యార్థుల ఆందోళన

కొండాపూర్, జూన్ 26: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ సెంట్రల్ జైలుగా మారుతుందని వర్సిటీ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్ అతిక్ అహ్మద్ అన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడితే వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లు తమను లక్ష్యంగా చేసుకుని యూనివర్సిటీ నుంచి బయటకు పంపించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. విద్యార్థులపై విధించిన సస్పెన్షన్, ఫైన్లు, ఎఫ్ఐఆర్‌లను వెంటనే రద్దు చేయాలంటూ వర్సిటీ ప్రధాన గేటు ముందు విద్యార్థులతో కలిసి బుధవారం ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వర్సిటీలో ప్రతి ఏడాది నిర్వహించే సుకూన్ ఈవెంట్‌ను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రద్దు చేయడంతో విద్యార్థుల తరపున వర్సిటీ వీసీ ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశామనే కోపంతో వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ తనతో పాటు మరో నలుగురు విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేసిందన్నారు. మరో ఐదుగురు విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఫైన్ విధించడంతో పాటు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయించినట్లు తెలిపారు. వెంటనే వర్సిటీ యాజమాన్యం తమపై విధించిన సస్పెన్షన్, ఫైన్‌లు, ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

లైంగికదాడి కేసులో.. నిందితుల కోసం గాలింపు

నేరేడ్‌మెట్, జూన్ 26: బాలికపై లైంగికదాడి కేసును కాచిగూడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి మంగళవారం నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేసిన సంగతి విదితమే. నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అందులో భాగంగా మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి, కుషాయిగూడ ఏసీపీ మహేష్ ఆదేశాలమేరకు నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడి విజయ్‌కుమార్‌గా గుర్తించి మరో ముగ్గురు నిందితులను బాలు, కృష్ణ, అజయ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరొక నిందితుడి కిరణ్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సొసైటీ చైర్మన్‌కు ఉత్తమ రుణ వసూళ్ల పురస్కారం

శామీర్‌పేట, జూన్ 26 : శామీర్‌పేట సొసైటీ చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభలో ఉత్తమ రుణ వసూళ్ల పురస్కారం లభించింది. రైతులకు ఉత్తమ సేవలు, ఉత్తమ రుణ వసూళ్కకు 2023-24 సంవత్సరానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార కేంద్రం బ్యాంకు ఈ మేరకు పురస్కారాన్ని అందించి సత్కరించారు.

ఖాజగూడ-రాయదుర్గం వరకు లింక్ రోడ్డు

- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఖాజగూడ-రాయదుర్గం వయా చిత్రపురికాలనీ నూతన లింకురోడ్డు విస్తరణ పనులను గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, జూన్ 26: ఖాజగూడ నుంచి రాయదుర్గం వరకు వయా చిత్రపురి కాలనీ మీదుగా నూతనంగా లింకురోడ్డు పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన ఖాజగూడ ప్రాంతంలో నూతనంగా చేపట్టబోయే 120 ఫీట్ల లింకు రోడ్డు ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాజగూడ పరిసర ప్రాంతాలకు చెందిన స్థానికులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన లింకురోడ్డు పనులు చేపట్టి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 120 ఫీట్ల విస్తరణతో రాయదుర్గం నుంచి ఖాజగూడ వరకు చిత్రపురికాలనీ మీదుగా ఈ నూతన లింకురోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. మెరుగైన జీవన ప్రమాణాల కోసం, ట్రాఫిక్ రహిత రహదారుల నిర్మాణం కోసం బీఆర్ఎస్ పార్టీ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు(ఎస్ఆర్‌డీపీ), హెచ్ఆర్‌డీసీఎల్ ప్రాజెక్టుల ద్వారా హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు వేలకోట్ల నిధులు ఖర్చుపెట్టి బ్రహ్మాండమైన లింకురోడ్ల నిర్మాణం, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించడం జరిగిందని తెలిపారు. గత 50 ఏండ్ల చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రజల సహకారం తీసుకొని అధికారులను సమన్వయం చేసుకుంటూ నూతనంగా లింకురోడ్ల నిర్మాణం చేపట్టాన్నారు. భవిష్యత్తు అవసరాలను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేశామని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, వసతుల కల్పనకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ గణపతి, టీపీఎస్ రవీందర్ తదితర అధికారులు, సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యం

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ వైస్ చైర్మన్ పద్మారావు

దుండిగల్, జూన్ 26 : దుండిగల్ మున్సిపాలిటీలోని అన్ని వార్డులను సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తుందని మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ 19వ వార్డు, సింహపురి కాలనీలో రూ.28 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు, రూ.26లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, వైస్ చైర్మన్ పద్మారావు, స్థానిక కౌన్సిలర్ వనితా బుచ్చిరెడ్డితో కలిసి ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుండిగల్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పని చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీపడొద్దని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, మురళీయాదవ్, ధర్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ శామీర్‌పేట రంగయ్య, నాయకులు, స్థానికులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే వివేకానందను కోరారు. ఇందుకు ఎమ్మెల్యేవివేకానంద సానూకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్లుగారి సత్యనారాయణ, భరత్‌కుమార్, మహేందర్ యాదవ్, నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన బాలానగర్ డీసీపీ

జగద్గిరిగుట్ట, జూన్ 26: సకాలంలో స్పందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ పోలీసు అధికారులకు సూచించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం సాయంత్రం జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బందితో సమావేశమై స్టేషన్‌లోని సౌకర్యాలు, పరిధిలోని ప్రధాన ప్రాంతాలు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుల కోసం వచ్చిన వారితో మాట్లాడారు. అనంతరం ప్రధాన కూడళ్లలో స్థానికులతో మాట్లాడుతూ.. మెరుగైన సేవలు అందేలా చూస్తామన్నారు. ఏసీపీ హన్మంతరావు, సీఐ క్రాంతికుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

లారీ దగ్ధం

ఘట్‌కేసర్,జూన్26:లారీటైర్‌పేలి బోల్తాపడి లారీ దగ్ధమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్టషన్‌లో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇసుక లోడ్ లారీ ఏటూరునాగారం నుంచి హైదరాబాద్‌కు వస్తున్న లారీకి ఏదులాబాద్ రోడ్డులోని అండర్‌పాస్ వంతెన వద్దకు రాగానే ముందు టైర్‌పేలి బోల్తా పడింది. లారీ డ్రైవర్ వెంకట్ రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో లారీ ముందు ఉన్న క్యాబిన్, టైర్లు కాలిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే నం.166లో ప్రభుత్వ భూమిని పరిశీలించిన మేడ్చల్ డీసీపీ



బౌరంపేట్‌లోని సర్వే నంబర్ 166, ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి

దుండిగల్, జూన్ 26 : గండిమైసమ్మ-దుండిగల్ మండలం, బౌరంపేట్‌లోని సర్వేనంబర్ 166, ప్రభుత్వ భూములను మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి బుధవారం పరిశీలించారు. సర్వే నంబర్ 166లో పోలీస్ లాజిస్టిక్ హబ్ కోసం గతంలోనే ప్రభుత్వం సుమారు 60 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో నుంచి ఔటర్‌రింగ్ రోడ్డులో 30 ఎకరాలు పోగా.. మిగతా 30 ఎకరాల స్థలం ఖాళీగా ఉన్నది. అయితే సదరు భూముల్లో కొందరు పశువులను కట్టేయడం వంటి పనులు చేపడుతుండటంతో భూములు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రహించిన అధికారులు సదరు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు సమాయాత్తం అవుతున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే డీసీపీ 166 సర్వే నంబర్ భూములను పరిశీలించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. కార్యక్రమంలో డీసీపీతో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ సీఐ శంకరయ్యతోపాటు గండిమైసమ్మ-దుండిగల్ మండలం గిర్దావర్ భారతి,సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

నాలా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఫతేనగర్‌లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్, అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 26: వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే... నాలా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికాలను ఆదేశించారు. బుధవారం ఫతేనగర్ డివిజన్‌లోని ఎల్‌బీఎస్ నగర్ నుంచి ఇందిరాగాంధీపురం వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించి.. స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసున్నారు. అనంతరం వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ, జలమండలి, వివిధ విభాగాల అధికారులు, వెల్ఫేర్ అసోసియేషన్ నేతలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఫతేనగర్ పరిసర ప్రాంతాలలో వర్షం నీటి ముంపు సమస్యలను నివారించాలంటే... యుద్ధప్రాతిపదికన నాలా అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్, భరత్‌నగర్ కాలనీలలో నాలా అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, ఈ పనులు ఆలస్యంగా జరుతున్నాయన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నాలా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య విభాగంలో పర్యవేక్షణ లోపించిందని, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం కనిపిస్తుందని సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రాత్రిళ్లు విద్యుత్ వీధిదీపాలు సరిగా వెలగడం లేదని, తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, వీధిదీపాలను వెలిగేలా చూడాలన్నారు. అలాగే కాలనీ, బస్తీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించాలని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీ రమేశ్, కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, భిక్షపతి, రాములు, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి దోమల వృద్ధిని నియంత్రించాలని ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఎమ్మెల్యేకు దోమలు, ట్రాఫిక్ సమస్యలపై రెయిన్‌బో విస్తాస్ రాక్‌గార్డెన్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు వినతిపత్రం అందించారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో 10వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారని, సమీపంలోని కాముని, మైసమ్మ, ముళ్లకత్వ చెరువులలో గుర్రపు డెక్క ఆవాసంగా చేసుకుని వృద్ధి చెందిన దోమలు పగలు, రాత్రీ తేడా లేకుండా దండయాత్ర చేయడం వల్ల ప్రజలు నిద్రలేని రాత్రులను గడపాల్సి వస్తుందన్నారు. ఈ దోమలతో గేటెడ్ కమ్యూనిటీ కాలనీతో పాటుగా కైత్లాపూర్, రాఘవేంద్ర కాలనీ, సేవాలాల్‌నగర్, మైస్టిక్‌హిల్స్, ఆంజనేయనగర్, సఫ్దార్‌నగర్, గాయత్రినగర్, మూసాపేట పరిసర ప్రాంతాల ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కైత్లాపూర్ నుంచి సేవాలాల్‌నగర్ వరకు రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి, రామిడి ప్రమోద్‌రెడ్డి, టి.రామ్‌కిరణ్, పూసపాటి దీప్తి తదితరులు ఉన్నారు.

శిల్పారామం సందర్శించిన విదేశీ మీడియా ప్రతినిధులు

కొండాపూర్, జూన్ 26: తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తున్న పర్యాటక, పారిశ్రామికి, విద్యా కేంద్రాలను సందర్శించేందుకు విచ్చేసిన విదేశీ మీడియా ప్రతినిధులు బుధవారం మాదాపూర్‌లోని శిల్పారామాన్ని సందర్శించారు. ఈస్ట్ ఆసియా, యూరేషియా, మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని జార్జియా, ఆర్మేనియా, ఇరాన్, బెలారస్, తుర్కెమెనిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, మంగోలియా, కజకిస్తాన్ దేశాలకు చెందిన ప్రముఖ మీడియాలకు చెందిన 21 మంది ప్రతినిధులు శిల్పారామాన్ని సందర్శించారు. శిల్పారామంలోని పల్లె వాతావరణం, చేనేత హస్తకళా రూపాలకు మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం కళాకారులు రితిక, తనిష్కలు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలను తిలకించి, కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన విదేశీ డిప్లొమసి డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

శిల్పారామాన్ని సందర్శించిన విదేశీ మీడియా ప్రతినిధులు

డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన

ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ఆర్ఐటీఎం, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు

దుండిగల్, జూన్ 26: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఎంఎల్ఆర్ఐటీఎం), ఫార్మసీ కళాశాల విద్యార్థులు బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్ డే (సే నో టు డ్రగ్స్) పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు మొత్తం వెయ్యి మందికి పైగా పాల్గొని దుండిగల్ పరిసర ప్రాంతాల ప్రజలకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ధీర ఆర్గనైజేషన్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.పి. శ్రీధర్, ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాల ప్రిన్సిపాల్ డా.మురళీప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అర్ణబ్ మాలిక్, కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు సాదర స్వాగతం



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు కుటుంబసభ్యులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

దుండిగల్, జూన్ 26 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) బుధవారం రాత్రి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా శంభీపూర్‌రాజు కుటుంబసభ్యులు కేటీఆర్‌కు సాదర స్వాగతం పలికారు. కొద్దిసేపు ఎమ్మెల్సీ కుటుంబసభ్యులతో కేటీఆర్ సరదగా గడిపారు. కేటీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు కేపీ.వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్యాదరి బాలమల్లు ఎమ్మెల్సీ ఇంటికి వచ్చిన వారిలో ఉన్నారు. కాగా, దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణి, కౌన్సిలర్ కృష్ణ దంపతులు కేటీఆర్‌ను శాలువాతో సత్కరించారు.

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను బుధవారం పేట్ బషీరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి కాలనీలో మౌలిక వసతులపై ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్పందించి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.
– కుత్బుల్లాపూర్, జూన్ 26

డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

కేపీహెచ్‌బీ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్, ఎస్‌టీపీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు, జలమండలి అధికారులు

కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 26 : కేపీహెచ్‌బీ కాలనీలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అభివృద్ధి పనులను చేస్తున్నట్లు కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలోని కల్వరి లెంపుల్ రోడ్డులో డ్రైనేజీ పనులు.. కాలనీ 4వ ఫేజ్ సమీపంలోని ముళ్లకత్వ చెరువు ఎస్‌టీపీ, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో కొత్తగా అభివృద్ధి చెందిన గోపాల్‌నగర్, శిల్పా ఎవెన్యూ, శ్రీలాపార్క్ ఫ్లైడ్, విశ్వంబర, డ్రీమ్ వ్యూ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల తరచుగా రోడ్లపైకి మురుగు నీరు చేరుతుందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించే దిశగా భారీ సామర్థ్యంతో సీవరేజీ పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. జీహెచ్ఎంసీ, ఇతర విభాగల అధికారులతో చర్చించి పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం షంశీర్, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్లు నాణ్యతగా నిర్మించాలి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ ఈస్ట్‌లో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి నిర్మాణాలను నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక వసతులను కల్పిస్తామని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ హామీ ఇచ్చారు. కాలనీల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు. *– మియాపూర్, జూన్ 26*

'నీట్' లీక్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

అల్లాపూర్, జూన్ 26 : బీహార్ రాష్ట్రంలో నీట్ ప్రశ్నాపత్రాలను లీక్ చేసిన నిందితులను అక్కడి ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి వంశీప్రసాద్ డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌ను నిరసిస్తూ అల్లాపూర్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్‌లో కాంగ్రెస్ నాయకుడు సున్నతో కలిసి వంశీప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రశ్నాపత్రాలను లీక్ చేసి విద్యార్థుల భవిషత్తుతో చెలగాడటమే కాకుండా, ప్రజల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టేస్తున్న నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత బీజేపీ ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, జనార్దన్, కుర్మయ్య, శివ, మహేశ్, బాలరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంశీ ప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు సుంకన్న